.

ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగం

హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ 28.02.2025 సమయం 1810 గంటలు

ముఖ్యాంశాలు

1. యువజనులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. ఈరోజు విజ్ఞాన్ వైభవ్ శాస్త్ర సాంకేతిక ఉత్సవాన్ని మంత్రి హైదరాబాద్ లో ప్రారంభించారు.
2. హైదరాబాద్ – బెంగుళూరును రక్షణ పారిశ్రామిక కారిడార్ గా ప్రకటించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.
3. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ ఎల్లుండి తెలంగాణాలో పర్యటించనున్నారు.
4. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద సుమారు 2 వేల 730 వేల కోట్ల రూపాయల వ్యయంతో తెలంగాణాలో 40 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.

TELANGANA-VIGNAN VAIBHAV

యువజనులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఈరోజు పిలుపునిచ్చారు అంతర్జాతీయంగా పోటీకి దీటుగా నిలవగల అత్యధిక సాంకేతిక పరిజ్ఞానాలు మన దేశంలో అందుబాటులో ఉన్నాయని, వాటిలో నైపుణ్యం సాధించాలని ఆయన చెప్పారు. దేశ భద్రత కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిగా వినియోగించుకొనేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన చెప్పారు. హైదరాబాదులోని గచ్చిబౌలి స్టేడియంలో విజ్ఞాన్ వైభవ్ 2025 అనే రెండు రోజుల శాస్త్ర సాంకేతిక ఉత్సవాన్ని ప్రారంభించిన అనంతరం విద్యార్థులను ఉద్దేశించి రక్షణ మంత్రి మాట్లాడారు. శాస్త్ర విజ్ఞానం మానవాళి సర్వతోముఖాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందని శాస్త్ర విజ్ఞాన రంగంలో ప్రగతిశీలకమైన అభివృద్ధి అనేది ఆర్థిక పెరుగుదలకు కూడా దోహదం చేస్తుందనీ ఆయన చెప్పారు.

(Bite)

ఆధునిక కాలంలో యుద్ధాలు ఆయుధ సామగ్రి వినియోగం తగ్గించి సాఫ్ట్వేర్ పై దృష్టి సారిస్తున్నాయని ఆయన అన్నారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానాలు అనేకం ఆవిర్భవిస్తున్న సమయంలో కృత్రిమ మేధస్సు క్వాంటం కంప్యూటింగ్ మెషిన్ లెర్నింగ్ క్లీన్ టెక్ వంటి పరివర్తనాత్మక పరిజ్ఞానాలను రూపొందించడంలో భారత్ అగ్రగామిగా నిలవాలని రాజ్ నాథ్ సింగ్ సూచించారు. ఎటువంటి ప్రతికూల పరిస్థితి అయినా కూడా మన దేశం కీలకమైన సాంకేతిక సవాళ్లకు పరిష్కారాలు ఇవ్వడం ద్వారా పటిష్టంగా సురక్షితంగా ఉండగలదని ఆయన అన్నారు.

(Bite Rajnath)

ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశ భద్రత బాధ్యత యువజనులదేనని చెప్పారు తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నగరం రక్షణ రంగంలో అనేక దశాబ్దాలుగా కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన చెప్పారు. లక్షమంది ఇంజనీరింగ్ పట్టభద్రులను అమెరికాకి పంపే కంటే రక్షణ రంగం కోసం మరింత మంది ఇంజనీర్లను తయారు చేయడం ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు. ఎన్నో రక్షణ పరిశ్రమలు ఉన్న కారణంగా హైదరాబాద్ బెంగుళూరును రక్షణ పారిశ్రామిక కారిడార్గా ప్రకటించాలని ఈ కారిడార్

ద్వారా భారీగా పెట్టుబడులను ఆకర్షించగలుగుతామని రేవంత్ రెడ్డి చెప్పారు. రక్షణ రంగంలో మన దేశాన్ని అగ్రగామిగా నిలిపేందుకు అని ప్రయత్నాలు చేస్తామని కేంద్రం పూర్తి సహకారం అందించాలని రేవంత్ రెడ్డి కోరారు.

(Bite CM )

ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ సతీష్ రెడ్డి అభివృద్ధి చెందిన దేశంగా నిలిచేందుకు సృజనాత్మకత పోషించే పాత్ర గురించి వివరించారు. (Bite) డిఆర్డిఓ ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా కలాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్ జాతీయ శాస్త్ర విజ్ఞాన దినోత్సవం సందర్భంగా విజ్ఞాన వైభవ్ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నాయి ఈ కార్యక్రమంలో విధాన నిర్ణేతలు శాస్త్రవేత్తలు పారిశ్రామిక దిగ్గజాలు, విద్యావేత్తలు యువ ఆవిష్కర్తలు ఒకే వేదిక పైకి వచ్చి దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే పరిజ్ఞానాల గురించి చర్చిస్తారు 2047 నాటికి వికసిత్ భారత్ దిశగా మన దేశం ప్రయాణిస్తున్న తరుణంలో స్వావలంబనకు మార్గం శాస్త్రీయ నైపుణ్యం సృజనాత్మకత సమన్వయం ద్వారా సుగమం అవుతుందని ఈ ఉత్సవం గుర్తు చేస్తోంది. డిఆర్డిఓ చైర్మన్ రక్షణ కార్యదర్శి డాక్టర్ సమీర్ వి కామత్ డిఆర్డిఓ డైరెక్టర్ జనరల్ డైరెక్టర్లు వివిధ పరిశ్రమల అధినేతలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు దాదాపు 30 వేల మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎమ్.ఎస్.ఎల్

భట్టి విక్రమార్క

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎల్లుండి వనపర్తిలో 6 వేల కోట్ల రూపాయల విలువ గల స్వయం ఉపాధి పథకాలను బ్యాంకర్లతో కలిసి ప్రారంభిస్తారని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఒక పండుగలా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. స్వయం ఉపాధి పథకాలు రాష్ట్ర జిడిపిని పెంచుతాయని, ఈ విషయంలో బ్యాంకర్ల పాత్ర కీలకమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఎస్.సి, ఎస్.టి., బిసి, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాలను అమలు చేయడం తమ ప్రభుత్వం ముందున్న అత్యంత ప్రధానమైన అంశమని

కూడా ఆయన అన్నారు. ఈరోజు బ్యాంకర్ల సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు.

పి.ఎన్

ఉపరాష్ట్రపతి విజిట్

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ ఎల్లుండి తెలంగాణాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో ఉపరాష్ట్రపతి ఐఐటి హైదరాబాద్ ను సందర్శించి, అధ్యాపకులు, విద్యార్థులతో ముచ్చటిస్తారు. నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో ఉపరాష్ట్రపతి పాల్గొని, అదే రోజు రాత్రికి కొత్త ఢిల్లీ తిరుగు ప్రయాణమవుతారు. ఉపరాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లకు సంబంధించి రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులతో సమావేశం నిర్వహించారు.

పిఎన్

రైల్వే

అమృత్ భారత్ స్టేషన్ పథకం 2 వేల 730 వేల కోట్ల రూపాయల వ్యయంతో తెలంగాణాలో 40 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ పథకంలో భాగంగా వివిధ రైల్వే స్టేషన్లను అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దడంతో పాటు, ప్రయాణికుల సదుపాయాలను మెరుగుపరుస్తారు. వరంగల్ రైల్వే స్టేషన్ ను సుమారు 25.41 కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నట్టు కూడా దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.

పిటిసి వరంగల్

సైన్స్ ప్రదర్శన

పిల్లలలో సైన్స్ విజ్ఞానాన్ని పెంపొందించడానికి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జాతీయ సైన్స్

దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఓల్డ్ బోయిన్ పల్లిలోని తార హోమ్ లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

పిటిసి హైదరాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా - సైన్స్

ఈరోజు జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు తయారుచేసిన పలు రకాల పరికరాలను ప్రదర్శించారు.

శాస్త్రీయ అంశాలు, పరిశోధనలపై విద్యార్థులకు అవగాహన పెరగాలని సంగారెడ్డి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా సర్ సివి రామన్ సైన్స్ మ్యూజియాన్ని పలు పాఠశాలల విద్యార్థులు సందర్శించారు.

పిటిసి సంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల

మార్కెట్ యార్డ్

జోగులాంభ గద్వాల జిల్లా అల్లంపూర్ నియోజక వర్గంలోని రైతులు పండించిన కందులను మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ పచ్చెర్ల కుమార్ ఈరోజు మార్కెట్ యార్డ్ లో పరిశీలించారు. కందికి ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర ప్రకారం క్వింటాలుకు 7 వేల 550 రూపాయల ప్రకారం ప్రతి గింజ కొనడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు.

పిటిసి జోగులాంబ గద్వాల్

ఉపాధిహామీ:

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఈరోజు దుగ్గొండి మండలం చాపల బండ గ్రామంలో క్షేత్ర స్థాయి లో

పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ కూలీలకు పని స్థలంలో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు.

వరంగల్ జిల్లా పీటీసి

వాలీబాల్ పోటీలు....

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం పోలీసుల ఆధ్వర్యంలో ఈ రోజు నుండి నాలుగు రోజుల పాటు జరుగుతున్న మండల స్థాయి వాలీబాల్ పోటీలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లోని యువత చదువుతోపాటు క్రీడల్లోను రాణిస్తూ, ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

పిటిసి భద్రాద్రి కొత్తగూడెం

తనిఖీలు

జనగామ జిల్లాలోని వివిధ రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాలను జిల్లా అధికారు ఈరోజు తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఆహారం అందించాలని, నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఈ సందర్భంగా అధికారులు పాఠశాలలు, వసతి గృహాల సిబ్బందికి సూచించారు.

పిటిసి జనగామ

పదో తరగతి పరీక్షలు

పదో తరగతి వార్షిక పరీక్షలలో మాల్ ప్రాక్టీస్‌కు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సిబ్బందిని కోరారు. కలెక్టరేట్‌లో పరీక్షల విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పదవతరగతి

పరీక్షలు జరుగుతాయి. జిల్లాలో 54 కేంద్రాల్లో 12 వేల 579 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారు.

పిటిసి కామారెడ్డి

గిరిజనులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మారుమూల ప్రాంతాలలో నివసించే గిరిజనులు.. గర్భిణీ స్త్రీలు ప్రాణాంతకమైన వ్యాధులకు గురి కాకుండా ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ సూచించారు. ఈరోజు మణుగూరు మండలంలోని పగిడేరు గ్రామంలో ఐటీడీఏ, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఆరోగ్య మిషన్ పథకం ద్వారా ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

పిటిసి భద్రాద్రి కొత్తగూడెం